ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ ఓల్డ్ మిర్జాల గూడలో శనివారం సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. కాంగ్రెస్ పార్టీ బీ–బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, ప్రవీణ్, సత్యనారాయణ, శ్రీకాంత్‌యాదవ్, వైద్యబృందం తదితరులు పాల్గొన్నారు.

నేడు మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం



పాకాలకుంట మల్లికార్జునస్వామి దేవాలయం

అల్వాల్: ఓల్డ్ అల్వాల్ పాకాలకుంటలోని మల్లికార్జునస్వామి దేవాలయంలో ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కల్యాణోత్సవం అనంతరం అన్నదానం, అగ్నిగుండం, గొలుసు తెంపుట, సోమవారం కొండపోచమ్మ తల్లి బోనాలు, పటం వేయుట కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు ప్రకటించారు. కావున భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం..

గొంతుకు చుట్టుకున్న కేబుల్ వైర్లు



మల్లాపూర్: ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి కేబుల్, ఇంటర్‌నెట్ వైర్లు గొంతుకు చుట్టుకుని ఉక్కిరిబిక్కిరి అయిన ఘటన నాచారంలో శనివారం చోటు చేసుకుంది. నాచారంకు చెందిన రాజు తన ద్విచక్రవాహనంపై నాచారం వైజయంతి థియేటర్ వద్ద తెగిపడిన కేబుల్, ఇంటర్‌నెట్ వైర్లు తన గొంతుకు చుట్టుకోగా ఊపిరి ఆడలేదు. త్రుటితో ప్రాణాపాయం తప్పింది. తక్కువ ఎత్తులో కేబుల్‌వైర్లు, ఇంటర్‌నెట్ వైర్లు ఏర్పాటుచేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని రాజు నాచారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న గీతామూర్తి

మౌలాలి: వినాయకనగర్ డివిజన్ పరిధిలోని బ్రిలియంట్ పాఠశాలలో శనివారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ సంస్థాగత ఎన్నికల కో– రిటర్నింగ్ అధికారిణి గీతామూర్తి పాల్గొని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు ఆమెను ఘనంగా సత్కరించారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

అల్వాల్: సైనిక్‌పురిలోని భవన్స్ వివేకానంద కళాశాలలో వాణిజ్య విభాగం, ఐసీఎస్ఎస్ఆర్–ఎస్ఆర్సీ హైదరాబాద్ సహకారంతో డాక్టర్ సంజీవరావు, విజయలక్ష్మి సమన్వయంతో రీసెర్చ్ మెథడాలజీపై మూడ్రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ విశ్వవిద్యాలయం సీనియర్ ప్రొఫెసర్ రాజశేఖర్ బెల్లంకొండ, ఐసీఎస్ఎస్ఆర్, ఎస్ఆర్సీ గౌరవ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డిలు హాజరై పలు విషయాలపై చర్చించి మాట్లాడారు. ఓయూ వాణిజ్య విభాగం బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ పాట్రిక్, డాక్టర్ జీఎస్‌వీఆర్‌కె.చౌదరి, కళాశాల వాణిజ్య విభాగాధిపతి కమలాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో ఇఫ్తార్ విందు



అల్వాల్: ఇఫ్తార్ విందులు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం వెంకటాపురం డివిజన్‌లోని బోరాని హౌసింగ్ సొసైటీలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎంపీ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సైఫుద్దీన్, సాహబీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ఉప్పల్, మల్కాజిగిరి జోన్ పరిధిలోని హబ్సిగూడ, కుషాయిగూడ, మల్లాపూర్, మేడిపల్లి, బోడుప్పల్, మౌలాలి, అల్వాల్, గౌతంనగర్ తదితర ప్రాంతాల్లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం జరిగిన ఈ వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని మహిళల గొప్పదనం గురించి వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాలయాల్లోని మహిళా సిబ్బంది, విద్యార్థులతో పాటు మహిళా పోలీసులను ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించారు.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం



కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి



ఉప్పల్ భగాయత్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శ్రీవాణి



పీర్జాదిగూడ 25వ డివిజన్‌లో..



చర్లపల్లిలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తదితరులు



సురేష్ సేవా సమితి ఆధ్వర్యంలో కార్పొరేటర్ శాంతి



అల్వాల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్



గౌతంనగర్ జ్యోతినగర్‌లో కార్పొరేటర్ సునీతకు సత్కారం



మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో..



మౌలాలి, ఏఎస్‌రావునగర్, చర్లపల్లి, ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్లు



పారిశుద్ధ్య సిబ్బందికి పాదపూజ చేస్తున్న శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్



ఈస్ట్ ఆనంద్‌బాగ్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో



జేజీఆర్ పాఠశాలలో..



జీహెచ్ఎంసీ మహిళా కార్మికులను సత్కరిస్తున్న బీజేపీ నాయకురాలు ధనలక్ష్మి



మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో..



ఉప్పల్ భగాయత్‌లో కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి



చిలుకానగర్‌లో రాగిడి లక్ష్మారెడ్డి, తదితరులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: నాచారం సబ్‌స్టేషన్ పరిధి 11కేవీ మల్టీస్టీల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నాచారం పారిశ్రామికవాడలో రోడ్డు నెంబర్ 07,08లో విద్యుత్ సరఫరా ఉండదని నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. 11కేవీ దుర్గానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నాచారం ఐడీఏ రోడ్డు నెంబర్ 18లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 11కేవీ టెక్‌పార్క్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఐడీఏ నాచారం రోడ్‌నెంబర్12లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేత



మల్లాపూర్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎస్ఎస్ఎస్ యువసేన వ్యవస్థాపకుడు, మాజీ సైనికుడు మామిడాల సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా శనివారం విద్యార్థులకు నోట్‌బుక్స్, ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులను అందజేశారు. టీపీసీసీ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు చింతల నిర్మల రెడ్డి, లయన్స్ క్లబ్ ఎలైట్ నాచారం అధ్యక్షులు మామిడాల రాజారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు కృష్ణారెడ్డి, జావీద్, శేఖర్, ఎస్ఎస్ఎస్ యువసేన ప్రతినిధులు కిషోర్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, కరుణాకర్, సాయిచంద్, శ్రీధర్, శ్రీకాంత్ తదితరులున్నారు.

అభివృద్ధిలో విష్ట హోమ్స్ ఆదర్శనీయం



కుషాయిగూడ: కాలనీ అభివృద్ధిలో విష్టహోమ్స్ తీరు ఆదర్శనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం కాలనీలో నిర్వహించిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవం, స్వచ్ఛ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమష్టిగా కాలనీ అభివృద్ధిలో ముందుకుసాగుతున్న విష్టహోమ్స్ కుటుంబాల తీరు ప్రశంసనీయమన్నారు. కాలనీ అభివృద్ధికి తన సంపూర్ణ తోడ్పాటునందిస్తానని చెప్పారు. తాగునీటి బిల్లులు, ప్రధాన రోడ్ల సమస్యలపై ఇప్పటికే అధికారులతో మాట్లాడానని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానన్నారు. సీసీఎస్ అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి, బీఆర్ఎస్ నేతలు పొందాల శివకుమార్‌గౌడ్, నేమూరి మహేష్‌గౌడ్, గంప కృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, వీరబ్రహ్మం, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

400 మంది పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని శ్రీ బాలాజీ ఫంక్షన్ హాల్‌లో శనివారం స్పైక్ ఫౌండేషన్ ఫౌండర్ సంజీవ్ కుమార్, పావని ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జీహెచ్ఎంసీలోని 400 మంది పారిశుద్ధ్య మహిళా కార్మికులను సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వీక్షిత్ భారత్ యూత్ పార్లమెంట్ – 2025 పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల

ఉప్పల్: ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు విద్యార్థులతో కలిసి వీక్షిత్ భారత్ యూత్ పార్లమెంట్ – 2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ.. 18 నుంచి 25 ఏళ్ల యువతను పరిపాలన, నాయకత్వంలో నిమగ్నం చేయడమే లక్ష్యమన్నారు. మై భారత్ పోర్టల్ ద్వారా దేశ నిర్మాణంపై ఒక నిముషం నిడివి గల వీడియోను సమర్పించమని విద్యార్థులను ప్రోత్సహించమన్నారు. వీడియో సమర్పణ మార్చి16 లోగా పంపాలని కోరారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రోగ్రామ్ కో– ఆర్డినేటర్ విద్యాసాగర్, ఎన్‌వైకేఎస్ జిల్లా యువజన అధికారి ఇసయ్య, కళాశాల ప్రిన్సిపాల్ జయంతి రెడ్డి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చారుకేశి ఫైన్‌ఆర్ట్స్ గురువులు, వారి శిష్య బృందంచే నిర్వహించిన భరతనాట్యం, కోలాటం, కర్ణాటక గాత్రకచేరి తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భరత నాట్యప్రదర్శనలో పుష్పాంజలి, మల్లరి కోలాటం, శ్రీరాఘవం, తులసిదాస్ భజన, తిల్లాన తదితర అంశాలను నిత్యశ్రీ, లోహిత, ధనుష్క, అక్షర, నవరత్న, అముక్తరెడ్డి, రుహిక తదితరులు ప్రదర్శించి మెప్పించారు.



గాన కచేరీలో గాత్రం చేస్తున్న చిన్నారులు

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్

కుషాయిగూడ: లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం జరుగుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, మల్కాజిగిరి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్ అన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కుషాయిగూడ మల్కాజిగిరిజిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ లోక్‌అదాలత్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కక్షిదారుల సౌలభ్యం కోసం ఏర్పాటుచేసే లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకుని సత్వర న్యాయం పొందాలన్నారు. లోక్‌అదాలత్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 21 బెంచీల్లో 316 సివిల్ కేసులు, 1,87,812 క్రిమినల్ కేసులకు పరిష్కారం చూపగా.. 19,996 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించి రూ.61,31,654 పరిహారం కింద చెల్లించినట్లు తెలిపారు. జిల్లా న్యాయమూర్తి ఆర్. రఘునాథ్‌రెడ్డి, అదనపు జిల్లా న్యాయమూర్తి విక్రమ్‌కుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కిరణ్‌కుమార్, కీసర రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకట ఉపేందర్‌రెడ్డి, డీసీపీ వెంకటరమణ, ఏసీపీ మహేష్‌కుమార్‌గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



రామంతాపూర్ : నెహ్రూనగర్‌లోని సెయింట్‌పాల్స్ హైస్కూల్‌లో విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలతో ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శన రెండోరోజు శనివారం స్థానికంగా ఉన్న పలు పాఠశాలల విద్యార్థులు సందర్శించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉప్పల్ మండల విద్యాధికారి రామారావు మాట్లాడుతూ.. ప్రతిభ అనేది ఏ ఒక్కరి సొత్తు కాదని, అది ప్రతి విద్యార్థిలో దాగి ఉంటుందన్నారు. దీనికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధీటిమల్లయ్య స్కూల్ కరస్పాండెంట్ జీఎస్‌శర్మ, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

అల్వాల్: అల్వాల్‌లోని త్రివేణి కిడ్స్ స్కూల్‌లో 'ఆస్క్ మీ మై ప్రాజెక్ట్' పేరిట సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ నుంచి ఐదోతరగతి వరకు విద్యార్థులు 300కు పైగా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి హాజరై నమూనాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైన్స్‌ఫెయిర్‌లతో విద్యార్థుల సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. భవిష్యత్తులో ఈ బాలశాస్త్రవేత్తలంతా భారతదేశ కీర్తిని పెంపొందించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ శ్రీసుధ, త్రివేణి సంస్థల సైన్స్ అధికారి సుబ్బారావు, అల్వాల్ జోన్ జోనల్ ఇన్‌చార్జి వెంకటరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన సీఐఏ, ఎంఎస్ఎంఈ పారిశ్రామిక ప్రదర్శన



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న సుధీర్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి

కుషాయిగూడ: చర్లపల్లి పారిశ్రామికవాడలోని చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్‌లో గత మూడ్రోజులుగా సాగుతున్న సీఐఏ 5వ ఎంఎస్ఎంఈ పారిశ్రామిక ప్రదర్శన శనివారం ముగిసింది. చర్లపల్లి పారిశ్రామికవాడకు చెందిన వందకు పైగా పారిశ్రామికవేత్తలు వారి వారి ఉత్పత్తుల ప్రదర్శన విజయవంతమైంది. ముగింపు కార్యక్రమానికి టిఫ్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, సీఐఏ అధ్యక్షుడు గోవింద్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రదర్శనలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇలాంటి ఎక్స్‌పోలతో పారిశ్రామికవేత్తల మధ్య సత్సంబంధాలు పెరిగి వ్యాపారాభివృద్ధికి దోహదపడతాయన్నారు. దీనిని పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మియపురం రమేష్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, గోపాలరావు, పీఎస్ మోహన్, మూర్తి, రమేష్‌కృష్ణ, కామేశ్వరరావు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.